నమస్తే తెలంగాణ
కరీంనగర్
10 | కరీంనగర్, శనివారం 14 డిసెంబర్ 2024 | KARIMNAGAR

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- మాజీ మంత్రి ఈశ్వర్

ధర్మపురి, డిసెంబర్13 : కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా నిలుస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. బుగ్గారం మండలం సిరికొండకు చెందిన తొవిటి రవి ఆగస్టులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. ఆయనకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2లక్షల విలువైన ఇన్సూరెన్స్ చెక్కును శుక్రవారం కరీంనగర్‌లోని తన నివాసంలో రవి భార్య లక్ష్మికి కొప్పుల అందజేశారు. అలాగే, ధర్మపురి మండలం గోవిందుపల్లికి చెందిన బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కోల శంకరయ్య జూలై 27న రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మృతుని కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు పార్టీ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మాజీ మంత్రి ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రవి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి కొప్పులఈశ్వర్

కోలొనిటీ: హైదరాబాద్‌కు వెళ్తున్న మెప్మా ఆర్పీలను కరీంనగర్ వద్ద అడ్డుకుంటున్న పోలీసులు

ఆర్టీసీ ఇదేం దోపిడీ!

- వాహనాల నిలుపుదల అద్దె పేరిట బాదుడే బాదుడు
- మహాలక్ష్మి స్కీం మొదలైన తర్వాత నుంచే మోటర్ సైకిల్, సైకిల్ స్టాండ్ల ధరలు రెండింతలు పెంపు
- 4 గంటలకైనా.. 24 గంటలకైనా ఒకటే రేటు
- కరీంనగర్ రీజియన్‌లోని బస్టేషన్లకు కేటగిరీగా విభజించి మరీ వసూలు
- ప్రయాణికుల జేబులకు చిల్లు

ఆర్టీసీ దోపిడీకి దిగుతున్నది. వాహనాల నిలుపుదల రెంట్ పేరిట ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతున్నది. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఫ్రీ బస్సు స్కీంను అమలు చేస్తున్నామని ఊకదంపుడు ప్రకటనలు చేస్తున్న కాంగ్రెస్, ఆ పథకం మొదలు పెట్టిన తర్వాత జనవరి నుంచే మోటార్ సైకిల్, సైకిల్ స్టాండ్ల అద్దెను రెండింతలకు పెంచేసింది. నిత్యం బస్సుల్లో వెళ్లే ప్రయాణికుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నది. కరీంనగర్ రీజియన్‌లోని బస్టేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి రోజు వారీ కిరాయి కాకుండా గంటల వారి రెంట్ పెట్టి గుంజుతున్నది. కేవలం ఆర్టీసీకి లాభం జరిగేలా టైమింగ్స్‌ను ఏర్పాటు చేసి, 4 గంటలకైనా 24 గంటలకైనా ఒకటే రేటు వసూలు చేస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది.



మోటర్ సైకిల్ స్టాండ్‌లో ఏర్పాటు చేసిన వాహన కిరాయిల పట్టిక

జగిత్యాల, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ రీజియన్‌లో బస్టాండ్లను ఆర్టీసీ కేటగిరీలుగా విభజించింది. కరీంనగర్, జగిత్యాల, హుస్నాబాద్ బస్టేషన్లను ఏ కేటగిరీగా గుర్తించింది. ఇక కార్పొరేషన్ అయిన గోదావరిఖని, జిల్లా కేంద్రమైన పెద్దపల్లి, కోరుట్ల, మెట్‌పల్లి, హుజూరాబాద్, వేములవాడ బస్టాండ్లను బీ కేటగిరీ కింద పేర్కొన్నది. సుల్తానాబాద్, కేశవపట్నం, ఎల్లారెడ్డిపేటతోపాటు ఇతర బస్టాండ్లను సీ కేటగిరీలో చేర్చింది. అయితే ఏ పారామీటర్ ఆధారంగా బస్టాండ్లను కేటగిరీలుగా విభజించిందో ఎవరికీ అర్థం కావడం లేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, జగిత్యాల, హుస్నాబాద్‌ను మాత్రమే ఏ కేటగిరీ బస్టాండ్లుగా పేర్కొనడం మిగిలిన వాటిని బీ, సీ కేటగిరీలో వేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. ఈ కేటగిరీల ప్రకారం బస్టాండ్లలో ఏర్పాటు చేసిన ఆటో, సైకిల్, మోటర్ సైకిల్ స్టాండ్స్‌కు సంబంధించిన కిరాయిలను నిర్ణయించింది. ఈ కిరాయిల ఆధారంగా స్టాండ్లకు వేలం వేసి కాంట్రాక్టర్లకు అప్పగించింది.

జగిత్యాల ఆర్టీసీ బస్టాండ్‌లోని మోటర్ సైకిల్ స్టాండ్

అడ్డగోలుగా కిరాయిలు

ఆర్టీసీ బస్టాండ్లలో ఏర్పాటు చేసిన సైకిల్, మోటర్ సైకిల్ స్టాండ్లలో ఆర్టీసీ గంటల లెక్కన కిరాయిలు వసూలు చేస్తున్నది. ఏ కేటగిరీలో కరీంనగర్, జగిత్యాల, హుస్నాబాద్ బస్టాండ్లలో ఉన్న మోటర్ సైకిల్ స్టాండ్‌లో గంట లోపు వాహనం ఉంచితే ₹10 వసూలు చేస్తున్నది. గంట నుంచి నాలుగు గంటల లోపు పార్క్ చేస్తే ₹25 తీసుకుంటున్నది. ఇక 4 గంటలకు ఒక్క నిమిషం దాటినా ₹40 వసూలు చేస్తున్నది. బీ కేటగిరీలో గంట లోపు అయితే ₹10, గంట నుంచి 4గంటల లోపు అయితే ₹15, నాలుగు గంటలు దాటితే ₹25 తీసుకుంటున్నది. సీ కేటగిరీలో గంటల లోపు అయితే ₹10, గంట నుంచి 4 గంటలలోపు అయితే ₹15, నాలుగు గంటల పైన, 24 గంటల లోపు అయితే ₹20 వసూలు చేస్తున్నది. ఈ ధరలన్నీ ఈ యేడాది జనవరి నుంచి ఆర్టీసీ అమలులోకి తెచ్చింది. గతంలో ఉన్న స్టాండ్ కిరాయిల కంటే ఈ కిరాయిలు దాదాపు రెట్టింపు కావడంపై వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో జగిత్యాల, కరీంనగర్, హుస్నాబాద్ బస్టాండ్లలో గంటలోపు వాహనం ఉంచితే ₹5 వసూలు చేసేదని, ఇప్పుడు ఏకంగా రెట్టింపు చేశారని మండిపడుతున్నారు. గంట నుంచి 4 గంటల లోపు ధరను ₹15 నుంచి ₹25కు పెంచారని, ఇక 4 గంటలపైన 24 గంటల లోపు స్టాండ్‌లో పెట్టిన వాహనానికి గతంలో ₹25 కిరాయి ఉండగా, ఇప్పుడు ఏకంగా ₹40 చేశారని చెబుతున్నారు

- బీ కేటగిరిలోనూ పెంపు భారీగానే ఉంది. గతంలో గంటలోపు ₹5 కిరాయిని, ఇప్పుడు ₹10కి పెంచింది. గతంలో 4 గంటల లోపు వాహనానికి ₹12 వసూలు చేయగా, ఇప్పుడు ₹15 చేసింది. 4గంటల నుంచి 24 గంటల మధ్య ఉన్న వాహనానికి గతంలో ₹20 ఉండగా, ఇప్పుడు ₹25 వసూలు చేస్తున్నది.
- సీ కేటగిరిలో గంట లోపు గతంలో ₹5 ఉండగా, ఇప్పుడు ₹10 చేసింది. 4 గంటల లోపు కిరాయి గతంలో ₹6 ఉండగా, ఇప్పుడు ₹15 వసూలు చేస్తున్నది. 4 గంటల నుంచి 24 గంటల లోపు ₹12 వసూలు చేయగా, ఇప్పుడు ₹20 వసూలు చేస్తున్నది. ప్రతి కేటగిరిలోనూ కిరాయిల పెంపు 40 నుంచి 50 శాతం వరకు ఉండగా, వాహనదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

గంటల లెక్కన వసూలుపై విమర్శలు

ఆర్టీసీ బస్టాండ్లలో మోటర్ సైకిల్, సైకిల్ స్టాండ్లలో గంటల లెక్కన కిరాయిలు వసూలు చేస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. సాధారణంగా 24 గంటలు ఉన్న రోజులో 8 గంటలు రాత్రి, 8 గంటలు పని సమయం, 8 గంటలు వ్యక్తిగత అంశాలకు కేటాయింపు ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలన్నీ 8 గంటల పనిదినాన్ని నిర్దేశించాయి. అందులోనూ 4 గంటలకు ఒక సెషన్‌గా ఉన్న విషయం తెలిసిందే. ఒక టీచర్, లేదా అధికారి ఎవరైనా, అరపూట సెలవు పెట్టారంటే, నాలుగు గంటలు సెలవు పెట్టారనే అర్థం. ఈ విషయం అందరికీ తెలిసిందే. వేతనాలు సైతం ఇదే పద్ధతిలో చెల్లింపు జరుగుతున్నది. ఎక్కడైనా ఇదే పద్ధతి అమలవుతుండగా, ఆర్టీసీలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. వాహనాన్ని గంట లోపు పార్క్ చేస్తే ₹10 వసూలు చేయడం, 4 గంటల లోపు అయితే మరింత ఎక్కువ రేటు వసూలు చేయడం, 4 గంటలు దాటితే 24 గంటల రేటును వసూలు చేయడాన్ని ప్రయాణికులు తప్పు పడుతున్నారు. గంట లోపు స్టాండ్‌లో వాహనం పార్క్ అనే విషయం అసహజంగా ఉందంటున్నారు. బంధువులు, స్నేహితులకు సెండాఫ్ ఇవ్వడానికి వచ్చేవారికి మాత్రమే గంట లోపు పద్ధతి ఉపయోగపడుతుందని, సహజంగా, సెండాఫ్ ఇచ్చేవారు ఎవరూ మోటర్ సైకిల్‌ను బస్టాండ్‌లో పార్క్ చేయరని వాహనదారులు చెబుతున్నారు. ఇక గంట నుంచి నాలుగు గంటల లోపు వాహనాన్ని పార్కింగ్ చేసేవాళ్లు సైతం ఉండరంటున్నారు. మోటర్‌సైకిల్‌ను బస్టాండ్‌లో పార్క్ చేస్తున్నారంటే కనీసం ప్రభుత్వ, ప్రైవేట్ విధులకు హాజరయ్యే ఉద్యోగులు, కార్మికులే అయి ఉంటారని, వారు ఎట్టి పరిస్థితుల్లోనూ 4 గంటల లోపు వాహనాన్ని తీసుకువెళ్లే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. నాలుగు గంటల లోపు వాహనాన్ని తీసుకునే వారి సంఖ్య కనీసం రెండు మూడు శాతం సైతం ఉండడం టున్నారు. ఉద్యోగులు, కార్మికులు 8 గంటల పని సమయం, ప్రయాణానికి మరో రెండు గంటలు వేసుకుంటే, 10 నుంచి 12 గంటలు పార్కింగ్ చేస్తారని చెబుతున్నారు. 12 గంటల పార్కింగ్‌కు ఒక కిరాయి ధర నిర్ణయించాల్సి ఉండగా, అలా చేయకుండా ఇరవై నాలుగు గంటల కిరాయి వసూలు చేస్తుండడం దోపిడే అని వారు విమర్శిస్తున్నారు. పైకి చూసేందుకు మోటర్ సైకిల్ స్టాండ్ కిరాయి చిన్న విషయంగా కనిపించినా, ఒక్కో వ్యక్తి రోజుకు ₹20 అదనంగా చెల్లించాల్సి వస్తుందని వాపోతున్నారు. నెలకు ₹600 చొప్పున లెక్కవేస్తే, ఏడాదికి ₹7వేల వరకు మోటర్ సైకిల్ స్టాండ్‌కు చెల్లించాల్సిన పరిస్థితి ఉన్నదని వాపోతున్నారు. కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి లాంటి బస్టాండ్లలో రోజుకు వేలాది మంది బైక్‌లు పార్క్ చేస్తున్నారని, వారందరి వద్ద నుంచి వసూలు చేస్తున్న డబ్బులను లెక్కిస్తే, లక్షల్లో ఉంటుందని పేర్కొంటున్నారు. కాగా, ఈ విషయమై అభిప్రాయం చెప్పాలని కొందరు వాహనదారులను కోరగా, 'సార్ వాయిస్ ఇస్తే. నా మోటర్ సైకిల్‌కు రోజు పంక్చర్ చేసి, ఇబ్బందిపెడుతారు. వద్దు సార్' అంటూ సున్నితంగా తప్పుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

నిబంధనల ప్రకారమే

ఆర్టీసీ నిబంధనల ప్రకారమే ద్విచక్ర వాహనాల స్టాండ్లను నిర్వహిస్తున్నాం. అందులో ఎలాంటి మార్పులు లేవు. గతంలోనూ గంటల పద్ధతిలోనే కిరాయిలు వసూలు చేశాం. అయితే గతంలో ఉన్న స్టాండ్‌ల ధరలను ఆర్టీసీ ఈ యేడాది సవరించింది. జనవరి 21న కొత్త రేట్లతో మెమోను జారీ చేసింది. దాని ప్రకారమే ఆర్టీసీ బస్టాండ్లలో ఉన్న వాహన స్టాండ్లను నిర్వహించాలని కాంట్రాక్టర్లను ఆదేశించాం. కొత్తగా పెంచిన కిరాయి ధరలను స్టాండ్‌లో ఫ్లెక్సీద్వారా ప్రదర్శిస్తున్నాం. ఏ కేటగిరీ బస్టాండ్‌లో 4 గంటల పైన పార్కింగ్ చేసిన వాహనానికి ₹35 కిరాయి వసూలు చేయాలని ఉంది. అయితే ₹5 సెస్‌తో కలిపి వాహనాదారుడి నుంచి ₹40 వసూలు చేస్తున్నాం.

- సునీత, జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్

ఆర్పీల నిర్బంధం

- ఆరు నెలలుగా అందని వేతనాలు
- అడిగేందుకు హైదరాబాద్ వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు
- రోజంతా అన్నపానీయాలు లేకుండా కట్టడి

కరీంనగర్ కార్పొరేషన్, డిసెంబర్ 13 : ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో అడిగేందుకు హైదరాబాద్ బయలుదేరిన మెప్మా ఆర్పీ (రిసోర్స్ పర్సన్స్)లను పోలీసులు నిర్బంధించారు. తమకు ఇంకెప్పుడు జీతాలు ఇస్తారని మెప్మా కార్యాలయాన్ని ముట్టడించి తాడో పేడో తేల్చుకుందామని అడిగేందుకు బయలుదేరగా, మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకున్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నగర పాలక సంస్థ మెప్మా విభాగం నుంచి 150 మంది ఆర్పీలు, మంథని నుంచి 11 మంది, పెద్దపల్లి నుంచి 30 మంది, సుల్తానాబాద్ నుంచి 20 మంది ఆర్పీలు రెండు ప్రైవేట్ బస్సుల్లో హైదరాబాద్‌కు బయలుదేరగా, విషయం తెలిసిన పోలీసులు కరీంనగర్ వద్ద మోహరించి ఆ వాహనాలను అడ్డుకున్నారు. గంటల తరుబడి నడిరోడ్డుపైనే నిల్చోబెట్టి ఏదో తప్పు చేసినట్టుగా ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనుమతి లేదంటూ అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత సుల్తానాబాద్ సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌కు తరలించి అక్కడే రోజంతా నిర్బంధించారు. కనీసం అన్న, పానీయాలు కూడా లేకుండా మహిళా ఉద్యోగులని కనికరం చూపకుండా ఇబ్బందులకు గురి చేశారని మానసిక క్షోభకు గురయ్యారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఆర్పీలను శుక్రవారం ఉదయం పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. జిల్లాలో మొత్తం 178 మంది ఆర్పీలుండగా, జూన్ నెల నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడ పట్టణం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు బయలుదేరిన 15 మంది ఆర్పీలను ఉదయం పోలీసులు అరెస్ట్ చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి సంఘీభావం తెలిపారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్ బయలుదేరేందుకు సిద్ధమైన మెప్మా నగరపాలక సంస్థ టీఎంసీ అనిత, ఆర్‌పీ రజితను పోలీసులు సాయంత్రం వరకు గృహనిర్బంధం చేశారు. హుజూరాబాద్‌లో పలువురు ఆర్పీలను పోలీసులు అదుపులోకి తీసుకొని వదిలిపెట్టారు.

మ్యాన్‌హోల్ క్లీనింగ్‌కు ఆధునిక రోబోటిక్

- హౌసింగ్‌బోర్డ్ కాలనీలో ట్రయల్‌రన్
- పరిశీలించిన నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ కార్పొరేషన్, డిసెంబర్ 13 : మ్యాన్ హోల్ క్లీనింగ్‌కు కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధునిక రోబోటిక్ యంత్రాన్ని తీసుకొచ్చింది. దీని పనితీరును శుక్రవారం హౌసింగ్‌బోర్డుకాలనీలో ట్రయల్ రన్ చేయగా, నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ యంత్రం పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తే కరీంనగర్‌ను మాన్యువల్ స్కావెంజింగ్ రహిత నగరంగా మార్చవచ్చని తెలిపారు. ఇందులో ఉత్తమమైన ఫీచర్లు ఉన్నాయని, ప్రధాన భాగాల్లో ఆటోమేటిక్ కలెక్షన్, డ్రై వేస్ట్ డంబర్, జనరేటర్, కాంప్రెసర్ వంటి పరికరాలు ఉన్నాయని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్‌లో మూల మూలలకూ వెళ్లి శుభ్రపరిచే సామర్థ్యం ఈ యంత్రంలో ఉందన్నారు. ఇందులో రోబోటిక్ ఆర్మ్ రోబోటిక్ పాదాలు, గ్రాబింగ్ బకెట్, విషపూరిత వాయువు అన్వేషణ వ్యవస్థ వంటి అధునిక ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. రోబోట్ యంత్రం 360 డిగ్రీ పద్ధతిలో మాన్‌హోల్ చాంబర్‌ను శుభ్రపరిచి.. మీథేన్, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫైడ్ వంటి విషపూరిత వాయువులను శోషించుకొని కార్మికులను రక్షిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, పర్యావరణ ఇంజినీర్ స్వామి పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో రోబోటిక్ యంత్రాన్ని పరిశీలిస్తున్న నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కొన్నది 58 శాతమే!

- కరీంనగర్ జిల్లాలో ముగింపు దశకు ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటికే 247 కేంద్రాలు మూసివేత
- 4 లక్షల మెట్రిక్ టన్నుల అంచనాకు 2.31 లక్షల మెట్రిక్ టన్నులే సేకరణ
- దళారుల చేతికి వెళ్లిన రైతన్న కష్టం
- మద్దతు ధర.. బోనస్‌కు నోచుకోని దైన్యం
- మరి కొన్ని రోజుల్లో కొనుగోళ్లకు మంగళం

కరీంనగర్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకున్నా, కొనుగోళ్లు 58 శాతానికి మించలేదు. ఈ వానకాలం సీజన్‌లో సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని అంచనా వేసినా.. ఇప్పటి వరకు కొన్నది 2.31 మెట్రిక్ టన్నులు దాటలేదు. నిజానికి జిల్లాలో వానకాలం సీజన్‌లో 2,73,397 ఎకరాల్లో వరిసాగు చేయగా, అందులో 1,51,982 ఎకరాల్లో దొడ్డు రకం, 1,21,415 ఎకరాల్లో సన్నరకాలు వేశారు. అందులో 3.17 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు, 2.48 మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం దిగుబడి రావచ్చని వ్యవసాయ శాఖ అధికారులు నివేదిక ఇచ్చారు. అందులో రైతులు తమ అవసరాల కోసం అట్టిపెట్టుకున్నవి తీసివేస్తే మొత్తం 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు రావచ్చని అంచనా వేశారు. అందుకోసం 340 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించారు. కానీ, 329 కేంద్రాలను మాత్రమే తెరిచి ఇప్పటి వరకు 2.31 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారు. అందులో 1.60 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 70.77 వేల మెట్రిక్ టన్నులు సన్నరకం ధాన్యం ఉన్నది. 3.17 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యానికి 1.60 లక్షల మెట్రిక్ టన్నులు అంటే 50 శాతం మాత్రమే కేంద్రాలకు వచ్చినట్టు స్పష్టమవుతున్నది. ఇక సన్నాల విషయానికి వస్తే 1.07 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందనుకుంటే 70.77 వేల మెట్రిక్ టన్నులే వచ్చింది. అంటే 1.57 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, సుమారు 36 వేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం దళారుల పాలైనట్లు స్పష్టంగా తెలుస్తున్నది.

వారంలో కొనుగోళ్లు నిలిపివేత?

కరీంనగర్ జిల్లాలో ఐకేపీ ద్వారా 48 కేంద్రాలు తెరవగా 42 సెంటర్లను, సహకార సంఘాల ద్వారా 233 కేంద్రాలు తెరవగా 165, డీసీఎంఎస్ ద్వారా 44 కేంద్రాలు తెరవగా 36, హాకా ద్వారా 4 కేంద్రాలు తెరవగా 4.. మొత్తంగా 247 కేంద్రాలను మూసివేసినట్టు అధికారులు తెలిపారు. మిగిలిన 82 కేంద్రాలను మరో వారంలో మూసివేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ వారంలో 6 నుంచి 10 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు జరగవచ్చని భావిస్తున్నారు.

మంత్రిపై చీటింగ్ కేసు పెట్టాలి

- హామీల అమలు ఏమైంది? • బెల్టు షాపుల బంద్ ఏది?
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే దుషణలా?
- శ్రీధర్‌బాబుపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఫైర్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, డిసెంబర్ 13: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిన మంత్రి శ్రీధర్ బాబుపై 420 చీటింగ్ కేసు నమోదు చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. ఆయనపై పోలీసులకు రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేస్తానని, పోలీసులు స్పందించకపోతే కోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పి ఏడాది కాలం గడుస్తున్నా ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని మండిపడ్డారు. తాను ఓట్ల కోసం బతికే నాయకుడిని కాదని, ప్రజా సమస్యల కోసం పోరాడే వ్యక్తినని, కాంగ్రెస్ హామీలను అమలు చేసే దాకా పోరాడుతామని, ఎన్ని విధాలుగా భయభ్రాంతులకు గురి చేసిన వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మంథనిలోని రాజగృహలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మంత్రి శ్రీధర్‌బాబుపై ఫైర్ అయ్యారు. నాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ముత్తారం వేదికగా మహిళల అభ్యర్థన మేరకు బెల్టుషాప్‌లను లేకుండా చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడెందుకు బంద్ చేయడం లేదని ప్రశ్నించారు. చదువురాని నాయకుడి మూలంగా మంథని అభివృద్ధిలో వెనుకబడిపోయిందని ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి తనపై ఎద్దేవా చేశాడని, కానీ, ఉన్నత చదువులు చదివాడని గొప్పలు చెప్పే మంథని ఎమ్మెల్యే ఏం చేశారని నిలదీశారు. మంథని నియోజకవర్గ ప్రజలు 40 ఏండ్లుగా ఒకే కుటుంబానికి అధికారం అప్పగిస్తే ఏం అభివృద్ధి పనులు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాము కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరును ప్రశ్నిస్తే కింది స్థాయి నాయకులతో దూషించేలా మాట్లాడించడం, తనపై దాడులు చేయించడం సరైంది కాదని, నియోజకవర్గ అభివృద్ధికి ఆలోచన చేయాలని హితవు పలికారు. అధికారంలోకి వచ్చి శ్రీధర్‌బాబు మంత్రిగా ఉన్నా చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఓడేడు వంతెనపై నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిందలు వేశారని, ఇప్పుడెందుకు పూర్తి చేయడం లేదన్నారు. మల్హార్ మండలం కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లి వరకు రహదారి నిర్మాణం కోసం ఫారెస్ట్ శాఖకు ₹4కోట్ల నిధులను ఎందుకు మంజూరు చేయలేకపోతున్నారన్నారు. ఏడాది కాలం లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఏ ఒక్క అభివృద్ధి పని చేయని అసమర్థుడు మంథని ఎమ్మెల్యే అని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, కిషన్‌రెడ్డి, పెగడ శ్రీనివాస్, కుమార్, మిర్యాల ప్రసాద్ రావు, వీరారెడ్డి, కాయితి సమ్మయ్య, శంకేసి రవీందర్, మంథని లక్ష్మణ్, వెల్పుల గట్టయ్య, ఆకుల రాజబాపు, మాచీడి రాజుగౌడ్, ఆసిఫ్, ఇర్ఫాన్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికుల ధర్నా

సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ రంగం కార్మికులు

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబర్ 13 : తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ.. భవన నిర్మాణంలో సుతారీలు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, పెయింటర్లు, సెంట్రింగ్, మార్బుల్, ట్రాక్టర్, వడ్డెర కార్మికులు.. ఇలా వేలాది మంది పనిచేస్తున్నారని, వారి చేతి వేళ్లు అరిగి ఆన్‌లైన్‌లో థంబ్ సిస్టం రావడం లేదని, ప్రభుత్వం దీనిని రద్దు చేయాలని, ఆన్‌లైన్‌ను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. నూతన లేబర్ కార్డులు, పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేయాలన్నారు. సిరిసిల్ల జిల్లాలో ఏసీఎల్, డీసీఎల్‌లను నియమించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ధర్నాలో గాజుల పోశెట్టి, అజ్జ వేణు, దుండ్రపెల్లి రవీందర్, శ్రీరాముల నర్సయ్య, పండుగ పోచమల్లు, పెంట మల్లయ్య, గాజుల మల్లయ్య, గంగ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన

ముకరంపుర, డిసెంబర్ 13: విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విద్యుత్ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని, ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈ శీతాకాల సమావేశాల్లో బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టే యోచనలో ఉన్నదని, దానిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. నిరసనలో నాయకులు కే అంజయ్య, ఎన్ అంజయ్య, వీరయ్య, శ్రీనివాస్, సంపత్ కుమార్, రమేశ్, కిరణ్, సత్యనారాయణ, శ్రీనివాస్, మల్లేశం డీఈలు తిరుపతి, రమణారెడ్డి రఘునందన్, భూమయ్య పాల్గ